ఈనాడు మంచిర్యాల

ఆదివారం ఆగస్టు 30, 2026

గుట్టలు కనిపిస్తే.. గుటుక్కు

● జిల్లాలో జోరుగా సాగుతున్న మొరం దందా

జిల్లాలో అక్రమార్కులు మొరం గుట్టలను తవ్వి వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూలుగా తీసుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు మాత్రమే తాత్కాలికంగా మొరం తవ్వకాలు ఆపి తర్వాత యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా, రాయల్టీ రుసుం చెల్లించకుండానే దందా చేస్తూ జేబులు నింపుకొంటున్నారు.

-న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం

లక్షెట్టిపేటలోని మోదెల శివారులో సిలువ గుట్టపై అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. స్థానికంగా అభివృద్ధి పనుల పేరు చెప్పి కొందరు అక్రమార్కులు వెంచర్లకు మొరం తరలిస్తున్నారు. ఇప్పటికే ఆ గుట్ట సమీపంలోని కొన్ని ప్రైవేట్ ప్లాట్లలో అక్రమంగా మొరం పోసి చదును చేశారు.

1. దండేపల్లి మండలంలోని గూడెంగుట్ట, లింగాపూర్, హాజీపూర్ మండలంలోని రాపల్లి గ్రామాల నుంచి మొరం అక్రమంగా తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

2. బెల్లంపల్లిలోని కన్నాల, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ప్రాంతాల్లో మొరం అక్రమ తవ్వకాలు జోరుగా చేపడుతున్నారు. ఆ మొరాన్ని స్థిరాస్తి వ్యాపారులు ప్రైవేట్ వెంచర్లకు, ఇళ్ల నిర్మాణంలో బెండడి నింపడానికి తరలిస్తున్నారు. రెండు నెలల కిందట అక్కడ జేసీబీలతో తవ్వి లారీల ద్వారా అక్రమంగా మొరం తరలించారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో గుట్టు చప్పుడుకాకుండా ట్రాక్టర్లతో అక్రమంగా మొరం తరలిస్తున్నారని ఆ కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.

3. మందమర్రి మండలంలోని బొక్కలగుట్టలో అక్రమంగా మొరం తవ్వి అమ్మకాలు చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన క్షేత్రస్థాయి అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో మౌనంగా ఉంటున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆ గుట్టపై బండరాయి, మొరం తవ్వకాలతో గుట్ట పరిధి భారీగా తగ్గిపోయింది. అదే మండలంలోని శంకర్‌పల్లి, సండ్రోన్‌పల్లి, జైపూర్ మండలంలోని శెట్టిపల్లిలోనూ అక్రమంగా మొరం తవ్వకాలు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం మొరం తవ్వకాలకు ప్రభుత్వ పరంగా ఎక్కడా అనుమతులు ఇవ్వలేదు. లక్షెట్టిపేటలోని మోదెల, దండేపల్లి మండలంలోని గూడెంగుట్ట వద్ద మొరం తవ్వకాలు చేయకుండా సిబ్బందితో తరచూ తనిఖీలు చేయిస్తున్నాం. ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం అక్రమంగా తవ్వి అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

-జగన్మోహన్, ఏడీ, గనుల శాఖ, మంచిర్యాల జిల్లా

భూముల రీసర్వేకు 81 గ్రామాల ఎంపిక

ఏసీసీ: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న భూముల రీసర్వే జిల్లాలో పక్కాగా చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 81 గ్రామాలు రీసర్వేకు ఎంపికయ్యాయన్నారు. మొదట గ్రామసభ నిర్వహించి ప్రజలకు సమాచారం అందించి గ్రామ సరిహద్దులు నిర్ణయించాలన్నారు. అదనపు కలెక్టర్ వి.రాములు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లికి చెందిన ఓ వృద్ధురాలు వేలిముద్రలు పడకపోవడంతో ఆధార్ కేంద్రానికి నవీకరణ కోసం వెళ్లగా సదరు నిర్వాహకుడు ఆమె నుంచి రూ. 250 వసూలు చేశాడు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుం రూ.125 కాగా రెట్టింపు వసూలు చేయడం గమనార్హం.

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ఆధార్ సెంటర్‌లో తొలిసారి ఆధార్ నమోదు కోసం రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. తొలిసారి నమోదుతోపాటు 17 ఏళ్లలోపు వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా చేయాల్సి ఉంటుంది.

ఆధార్.. వసూళ్లతో బేజారు

● దోపిడీకి పాల్పడుతున్న కేంద్రాల నిర్వాహకులు

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి, వ్యక్తిగత గుర్తింపునకు ఆధార్ ప్రామాణికంగా మారింది. వివిధ సేవలకు ఈ కార్డును ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. తొలిసారిగా ఆధార్ నమోదు నుంచి మొదలు పేరు, లింగం, చిరునామా, పుట్టిన తేదీ, చరవాణి నంబరు ఉన్నతీకరణ, వృద్ధాప్యంలో వేలిముద్రలు సరిపోక బయోమెట్రిక్ నవీకరణ వరకు ప్రతి ఒక్కరికీ వివిధ సందర్భాల్లో ఆధార్ కేంద్రానికి వెళ్లక తప్పని పరిస్థితి. ఇదే సేవా కేంద్రాల నిర్వాహకులకు వరంగా మారింది. ఉచితంగా అందాల్సిన సేవలకు డబ్బులు వసూలు చేస్తూ అక్రమార్జనకు తెరలేపారు.

జిల్లాలోని ఓ ఆధార్ సేవా కేంద్రంలో వినియోగదారులు

- న్యూస్‌టుడే, లక్షెట్టిపేట, జైపూర్

ప్రభుత్వ నిర్దేశించిన రుసుం ఇలా..

- తొలిసారి ఆధార్ నమోదు: ఉచితం
- పేరు, లింగం, చిరునామా, పుట్టిన తేదీ, చరవాణి ఉన్నతీకరణ : రూ.75
- బయోమెట్రిక్ అప్‌డేట్ (5-7 సంవత్సరాలు/15-17 సంవత్సరాలు) : ఉచితం
- బయోమెట్రిక్ నవీకరణ (ఫొటో, వేలిముద్రలు) : రూ.125
- డాక్యుమెంట్ అప్‌డేట్ : రూ.75
- ఆధార్ సెర్చ్/ ప్రింట్ : రూ.40

కొరవడిన అవగాహన

ఆధార్ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుం వివరాలతో ధరల పట్టికను అందరికీ కనిపించే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొన్నింటిలో రుసుమును సూచించిన పట్టికలు లేకపోగా మరి కొన్నింటిలో మొక్కుబడిగా ఏర్పాటు చేసినా సరైన వివరాలు లేవు. అదనపు వసూళ్ల బాగోతం బయటపడకుండా ఉండేందుకు కేవలం నగదు మాత్రమే తీసుకుంటున్నారు. ఇక తప్పని పరిస్థితుల్లో ఆన్‌లైన్ ద్వారా డబ్బు తీసుకోవాల్సివస్తే తమ ఖాతాలోకి కాకుండా తమ కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి డబ్బు బదిలీ చేయించుకుంటున్నారు.

నిఘా: దండె కొడుతూ.. దగా చేస్తూ

● లబ్ధిదారుల నుంచి బియ్యం దండుకుంటున్న డీలర్లు

జిల్లాలోని ఓ రేషన్ దుకాణంలో తక్కువ బరువులను ఒక యంత్రంపై ఎక్కువ బరువులను మరో యంత్రంపై తూకం వేస్తున్న చిత్రమిది..

జిల్లాలోని కొందరు డీలర్లు పేదలకు అందించే రేషన్ బియ్యంలో మోసానికి పాల్పడుతున్నారు. సాంకేతికత సహాయంతో తూకంలో అక్రమానికి పాల్పడుతూ దండె కొడుతున్నారు. ఎలక్ట్రానిక్ తూకం యంత్రంలో చిప్ అమర్చడం ద్వారా రిమోట్ సహాయంతో యంత్రాన్ని నియంత్రిస్తూ ఒక్కో లబ్ధిదారు నుంచి వారికి ఇస్తున్న బియ్యం బరువు ఆధారంగా రెండు నుంచి అయిదు కిలోల వరకు తక్కువ తూకం వేస్తున్నారు. ఎప్పటికప్పుడు తూకం యంత్రాలపై దృష్టి సారించాల్సిన తూనికలు, కొలతల అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో దందా జోరుగా సాగిస్తున్నారు.

- న్యూస్‌టుడే, లక్షెట్టిపేట



రిమోట్ సహాయంతో తూకం యంత్రాన్ని నియంత్రిస్తున్న చిత్రం

కార్డు ఆధారంగా..

ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున రేషన్ బియ్యం అందజేస్తోంది. ఇద్దరు లేదా ముగ్గురు ఉన్న కార్డుల విషయంలో దొరికిపోయే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటిస్తున్న డీలర్లు ఎక్కువ మంది సభ్యులున్న లబ్ధిదారుల వద్ద ఇలా దండె కొడుతున్నట్టు తెలుస్తోంది. కొందరు డీలర్లు రెండేసి యంత్రాలు వాడటం ద్వారా తక్కువ సభ్యులు ఉన్న కార్డుదారులకు ఒక యంత్రం మీద, ఎక్కువ మంది సభ్యులు ఉన్న లబ్ధిదారులకు సెట్టింగులు ఉన్న తూకం యంత్రంపై కాంటా వేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వినియోగదారుడు డీలర్ వద్ద బయోమెట్రిక్ వేలిముద్ర వేసేటప్పుడు గమనించే సమయం ఇవ్వకుండానే సహాయకుడు తూకం వేసి సంచిని యంత్రం నుంచి పక్కకు తప్పిస్తున్నట్టు వినియోగదారులు చెబుతున్నారు. ఎవరైనా గమనించినా, తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీలకు వచ్చిన సమయంలో వెంటనే యంత్రాన్ని స్విచ్ఛాఫ్ చేసి తిరిగి ఆన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. దీని వల్ల సెట్టింగులు మారి సాధారణ స్థితికి వస్తుంది. మూడు నెలల బియ్యం ఈ ఏడాది రెండు సార్లు ఇవ్వడంతో ఈ మోసంతో డీలర్ల పంట పండుతోంది.

ఎలా నియంత్రిస్తారంటే...

ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలను నియంత్రించేందుకు మార్కెట్‌లో రిమోట్‌లు అందుబాటులోకి వచ్చాయి. కొందరు డీలర్లు వాటిని కొనుగోలు చేస్తూ మోసానికి తెర తీస్తున్నారు. యంత్రానికి చిప్‌ను అమర్చడం ద్వారా బరువును రిమోట్ ద్వారా నియంత్రిస్తున్నారు. డిజిటల్ తూకం యంత్రం కావడంతో గ్రాములు మొదలు కిలోల వరకు అంకెలను తగ్గించడం, పెంచడం చేయవచ్చు. చేతిలో ఇమిడే చిన్న రిమోట్ కావడం, సాంకేతికత గురించి చాలా మందికి అవగాహన లేకపోవడంతో మోసానికి పాల్పడటం సులువుగా మారింది.

భారీ గుంత.. నిత్యం చింత

భీమిని మండలం వడాల, కేస్లాపూర్ గ్రామాల మధ్య ఒర్రెపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వాహనదారులు కాగజ్‌నగర్ పట్టణంతో పాటు అయిదు గ్రామాలకు రాకపోకలు సాగిస్తారు. చిన్నపాటి వర్షానికే వంతెనపై నుంచి నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. ప్రధాన రోడ్డు కావడం, మధ్యలో పెద్ద గుంత ఏర్పడటంతో జనం భయపడుతున్నారు. మధ్యలో ఉన్న గుంతను తప్పించబోయి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పుతున్నాయని వాపోతున్నారు. వర్షం కురిస్తే గుంత కనిపించక వాగులో కొట్టుకుపోయే ప్రమాదముంది. - న్యూస్‌టుడే, భీమిని

ప్రభుత్వ పాఠశాల.. ప్రవేశాల కళ

● 96.31 శాతం నమోదుతో రాష్ట్రంలో మొదటి స్థానం

న్యూస్‌టుడే, మంచిర్యాల, విద్యావిభాగం : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రికార్డు స్థాయిలో ప్రవేశాలు పెరిగాయి. ప్రవేశాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. కార్పొరేట్ స్థాయిలో సర్కారులో బోధన అందిస్తుండగా వేలాది మంది విద్యార్థులు ఈ సారి ప్రభుత్వ బడుల బాట పట్టారు. ఈ విద్యాసంవత్సరం 3,560కి పైగా ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పొందడం గమనార్హం.

ప్రభుత్వ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరంలోని విద్యార్థుల సంఖ్య కంటే 10శాతం అదనంగా విద్యార్థుల నమోదు చేపట్టాలని లక్ష్యాన్ని విధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కలెక్టర్ కుమార్ దీపక్ సూచనల మేరకు డీఈవో పి. చంద్రయ్య విద్యాశాఖ అధికారులతో ప్రవేశాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. నిత్య సమీక్షలు, రోజువారీగా పర్యవేక్షణ, డ్రాప్ అవుట్‌లను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం వంటివి సత్ఫలితాన్నిచ్చాయి. ఈ సంవత్సరం 47,379 మంది విద్యార్థుల లక్ష్యాన్ని నిర్దేశించగా 96.31 శాతం చేరుకొని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. మొత్తంగా 275 పాఠశాలలు 10శాతం అదనంగా ప్రవేశాలు కల్పించాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

రాష్ట్ర స్థానం :	2024-25లో విద్యార్థుల నమోదు:	2025-26లో „ :	10శాతం అదనపు లక్ష్యం :	2026-27 నమోదు లక్ష్యం :	ప్రస్తుతం నమోదు :	నమోదు శాతం :
మొదటి	41,349	43,072	4307	47,379	45,629	96.31

వసతుల కల్పనకు ప్రాధాన్యం

జిల్లాలో విద్యారంగ అభివృద్ధి, చేపడుతున్న వినూత్న సంస్కరణలతో తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ముందుకొచ్చారు. ప్రభుత్వం విధించిన ప్రవేశాల లక్ష్యంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచాం. ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ బోధనలు అందిస్తున్న నేపథ్యంలో చాలామంది ప్రైవేటు నుంచి చేరారు. వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నాం.

- పి.చంద్రయ్య, డీఈవో, మంచిర్యాల

సిబ్బంది కొరత.. డిప్యుటేషన్ల వెత

● పీహెచ్‌సీల దుస్థితి..

వెళుతూనే ఉన్నారు...

తాండూరు పీహెచ్‌సీలో ముగ్గురు వైద్యులు ఉండాల్సి ఉండగా ఇద్దరిని డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతాలకు పంపించారు. పబ్లిక్ హెల్త్ నర్సును మంచిర్యాలకు, ల్యాబ్ టెక్నీషియన్‌ను బెల్లంపల్లి సీహెచ్‌సీకి, స్టాఫ్ నర్సును రాజీవ్‌నగర్ యూపీహెచ్‌సీకి, ఆఫీస్ సబార్డినేట్‌లలో ఒకరిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆఫీస్‌కు, మరొకరిని కన్నెపల్లి పీహెచ్‌సీకి, డీఈఓను జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపించారు. ఉన్న ఒక్క వైద్యురాలు శనివారం సెలవులో ఉండటంతో రోగులను స్టాఫ్ నర్సు పరీక్షించి చికిత్సనందించారు.

తాండూరులో రోగులను పరీక్షిస్తున్న స్టాఫ్‌నర్సు

తాండూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మారుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓ వైపు సిబ్బంది కొరత వేధిస్తుండగా మరోవైపు డిప్యుటేషన్ల పరంపర మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారుస్తోంది. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో గర్భిణులు, ఓపీకి వచ్చే రోగులు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా పరిధిలో 18 పీహెచ్‌సీలు, 2 ఏరియా ఆసుపత్రులు, 1 సీహెచ్‌సీ, 1 జనరల్ ఆసుపత్రి ఉన్నాయి.

పరిశీలన

బెల్లంపల్లి యూపీహెచ్‌సీలో భవనం అధ్వానంగా మారి పడకలు వరండాలో వేశారు.



కన్నెపల్లిలో ఖాళీగా ల్యాబ్ గది

కొత్త కష్టాలు..

కన్నెపల్లి పీహెచ్‌సీని 6 నెలల కిందటే ఏర్పాటు చేశారు. ఒక వైద్యుడు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇతర సబ్ సెంటర్ల నుంచి రోజుకొక ఏఎన్ఎం విధులు నిర్వర్తిస్తారు. పరీక్షలు నిర్వహించేందుకు పరికరాలు లేవు. భీమిని నుంచి మందులు తీసుకొచ్చి ఇక్కడ పంపిణీ చేస్తున్నారు.

ముగ్గురే వచ్చారు..

కోటపల్లి పీహెచ్‌సీలో వైద్యుడు 10.30 గంటలకు ఆసుపత్రికి వచ్చారు. ఆ సమయానికి ముగ్గురు సిబ్బంది మాత్రమే హాజరుపట్టికలో సంతకాలు పెట్టి ఉన్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ఫార్మసిస్టు, ఆఫీస్ సబార్డినేట్, మూడు హెల్త్ అసిస్టెంట్, నాలుగు ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

దండేపల్లి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లగా మరొకరు ఉన్నత చదువుల కోసం వెళ్లారు. జన్నారం పీహెచ్‌సీ ఒప్పంద మెడికల్ అధికారి ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. తాళ్లపేట పీహెచ్‌సీ వైద్యురాలికి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు.

వైద్యురాలు ఎక్కడ..

భీమిని పీహెచ్‌సీలో శనివారం ఉదయం 10 గంటలు దాటినా వైద్యురాలు ఆసుపత్రికి చేరుకోలేదు. ఒక స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్యులు, సీనియర్ అసిస్టెంట్, సీహెచ్‌ఓ, హెల్త్ సూపర్‌వైజర్, రెండు స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు డిప్యుటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని రకాల మందుల కొరత ఉంది.

భీమినిలో ఖాళీగా ఉన్న వైద్యురాలి కుర్చీ

బౌన్సర్ల అడ్డా.. రసూల్‌పల్లి

సినీనటులు షూటింగ్‌లకు, షాపింగ్‌మాళ్లకు వెళ్లినప్పుడు, ప్రముఖుల కుటుంబ సభ్యుల వివాహాలు, ప్రైవేటు కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు జనం వారిని చూసి కలవడానికి ప్రయత్నిస్తారు. గుమిగూడుతారు. ఆ రద్దీ నుంచి వారిని కాపాడేందుకు రక్షణగా బౌన్సర్లు ఉంటారు. ఒకప్పుడు బౌన్సర్లను హైదరాబాద్‌లాంటి నగరాల నుంచి పిలిపించేవారు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలోని మారుమూల పల్లె రసూల్‌పల్లి నుంచి పదుల సంఖ్యలో యువత బౌన్సర్లుగా పని చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, నెన్నెల

జైపూర్ మండలం రసూల్‌పల్లికి చెందిన యువకుడు కుమ్మరి ప్రవీణ్‌కుమార్ మంచిర్యాలలోని ఒలింపియా జిమ్‌కు శిక్షణకు వెళ్లారు. అక్కడ జిమ్‌లో చాలామంది యువత మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నారు. కానీ ఉపాధిలేక ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని గమనించిన జిమ్ యజమాని నవీన్ హైదరాబాద్‌లాంటి నగరాల్లో బౌన్సర్లుగా పని చేయడానికి మంచి అవకాశాలున్నాయని ప్రవీణ్‌కుమార్‌కు చెప్పారు. ప్రవీణ్ ఆలోచించి 10 మంది యువకులతో బృందాన్ని ఏర్పాటు చేసి, మొదట స్థానికంగా చిన్న కార్యక్రమాలకు వెళ్లారు. క్రమంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ప్రముఖులకు సేవలందిస్తున్నారు. ప్రస్తుతం వీరి బృందంలో 30 మంది పురుష బౌన్సర్లు, 10 మంది మహిళా బౌన్సర్లు ఉన్నారు. షాపింగ్ మాళ్ల ప్రారంభోత్సవాలు, పెళ్లి ముహూర్తాల సమయాల్లో వీరికి చాలా డిమాండ్ ఉంటుంది.

జిల్లాలోని రసూల్‌పల్లితో పాటు యాప, దేవాపూర్, భీమారం, చెన్నూరు, టేకుమట్ల గ్రామాలకు చెందిన యువత బృందంలో ఉన్నారు.

జిమ్‌లో కసరత్తులు చేస్తున్న బౌన్సర్లు

ప్రవీణ్‌కుమార్, రవి, శ్రీను, జనార్దన్ ముందుండి జట్టును నడిపిస్తున్నారు.

ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన బౌన్సర్లు

దినచర్య ప్రత్యేకం..

బౌన్సర్లుగా పని చేసే వారి దినచర్య ప్రత్యేకంగా ఉంటుంది. ఉదయం 5 గంటలకే జిమ్‌లో కసరత్తు మొదలుపెడతారు. రెండు గంటల పాటు కసరత్తులు చేస్తుంటారు. వ్యాయామం తర్వాత అయిదు ఉడకబెట్టిన గుడ్లు, అర లీటరు పాలు తీసుకుంటారు. రోజు కనీసం 30 నిమిషాలు నడుస్తుంటారు. మాంసం, ఆకుకూరలు, తాజా కూరగాయలు వీరి ఆహారంలో తప్పనిసరిగా ఉంటాయి. ఆరునెలలు ఈ దినచర్య పాటిస్తేనే మా బృందంలోకి తీసుకుంటామని టీమ్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ చెప్పారు.

గౌరవం, ఉపాధి రెండూ లభిస్తున్నాయి..

బౌన్సర్లుగా పని చేయడంతో ఉపాధి, గౌరవం రెండూ లభిస్తున్నాయి. ఒకప్పుడు పని లేక ఇబ్బంది పడ్డ యువత నేడు బౌన్సర్లుగా రాణిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ కార్యక్రమాలు ఉన్నా మాకు పిలుపువస్తోంది. క్రమశిక్షణ కలిగిన యువతను ఎంపిక చేసి జట్టులోకి తీసుకుంటున్నాం.

-ప్రవీణ్‌కుమార్, టీమ్ ఇన్‌ఛార్జి

భూభారతి సేవల్లోకి జూనియర్ అసిస్టెంట్లు

న్యూస్‌టుడే, కాసిపేట : ధరణి, భూ భారతి పోర్టల్‌లలో సేవలందించిన ఆపరేటర్లను ప్రభుత్వం వారి లాగిన్లను(బయోమెట్రిక్) తొలగించింది. రెవెన్యూ రిజిస్ట్రేషన్లు, విరాసత్, ఇతర పట్టా మార్పిడీ, ఇలా అనేక ఇతర సేవలు అందించిన ఆపరేటర్లను ప్రభుత్వం తొలగించింది. అర్ధాంతరంగా విధుల నుంచి తొలగించడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో ఏజెన్సీ ద్వారా ధరణిలో నూతన పోర్టల్‌లో సేవలు అందించేందుకు గత ప్రభుత్వం వీరిని నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో సైతం నూతన భూభారతి చట్టంలో సైతం సేవలు అందిస్తూ వచ్చారు. వీరి స్థానంలో జూనియర్ అసిస్టెంట్లను తీసుకొచ్చారు. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి సేవలకు వినియోగించుకుంటున్నారు.

అందని వేతనాలు

ఆపరేటర్లకు 15 నెలలుగా వేతనాలు రావడం లేదు. వేతనాలు ఇవ్వకుండా తమకు సమాచారం లేకుండానే లాగిన్లను తొలగించడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో నేటికీ సేవలు అందిస్తున్నారని, మంచిర్యాల జిల్లాలో మాత్రమే తమ లాగిన్లను తొలగించి, జూనియర్ అసిస్టెంట్లకు అప్పగించారని చెప్పారు. ప్రభుత్వం తమకు అందించే వేతనాలను సైతం సకాలంలో విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం తమకు అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు.

సేవల్లో మేటి.. స్వర్ణోత్సవ ఖ్యాతి 6లో

SREE RAGHAVENDRA B.Ed & B.P.Ed COLLEGES, ARMOOR, NIZAMABAD DIST.
Without Entrance Seats available
9440090131
9966962792
9885285343

ఎంట్రెన్స్ లేకున్నా B.Ed.
వాయిదా ఫీజులు
మేనేజ్‌మెంట్ సీట్స్
JN కాలేజి
వేములవాడ
✆: 92469 32088

WANTED
A well established Barcode Labels Manufacturing Company required young and dynamic
MARKETING EXECUTIVES
Age : Below 35 years
Salary: 20,000 to 25,000
Qual: Any Degree with Two Wheeler, No Sales Target
WEBPROS SOLUTIONS MANCHERIAL
✆ 9063750407

టికెట్ల రాజకీయం.. ఇక్కట్లకు కారణం

● కాంగ్రెస్‌లో బయటపడుతున్న నేతల వైరం

ఈటీవీ- ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గతంగా నెలకొన్న వైరం క్రమంగా బయటపడుతోంది. శాసనసభ ఎన్నికల్లో టికెట్లే ప్రామాణికంగా ఇప్పటి నుంచి పార్టీలో పట్టుసాధించాలనే తాపత్రయం గ్రూపు విభేదాలకు కారణమవుతోంది. ప్రధానంగా వివేక్ వెంకటస్వామి- ప్రేమ్‌సాగర్‌రావు మధ్యనే వైరం ఉందనుకుంటే ఇప్పుడు జిల్లాల వారీగా విస్తరించి ఎక్కడికక్కడ నేతలు నువ్వా-నేనా అన్నట్లు వ్యవహరిస్తుండటం పార్టీలో కలకలం సృష్టిస్తోంది. ఇటీవల ఉట్నూరులో జరిగిన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సంజీవరెడ్డి మధ్య విభేదాలు పొడచూపాయి. తాజాగా ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష బాధ్యతల నుంచి నరేశ్ జాదవ్‌ను తప్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడె గజేందర్ నేతృత్వంలో కార్యకర్తలు గాంధీ భవన్ బాట పట్టడం కలకలం రేకెత్తించింది.

ఇప్పటికే ఆదిలాబాద్ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి వర్గానికి నరేశ్‌జాదవ్‌తో పొంతన కుదరటం లేదు. నరేశ్ జాదవ్-ఆడె గజేందర్ ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన నేతలు. పైగా ఇద్దరికిద్దరూ బోథ్ అసెంబ్లీ టికెట్‌పై ఆశతో ఉన్నారు. మరో సామాజిక వర్గానికి చెందిన కంది శ్రీనివాసరెడ్డి- సంజీవరెడ్డి సైతం వచ్చే ఎన్నికల్లో ఆదిలాబాద్‌లో పట్టు సాధించాలనే వ్యూహాత్మకంగా ఉన్నతస్థాయిలో చక్రం తిప్పుతుండటమే ఇరువర్గాల మధ్య వైరానికి కారణంగా కనిపిస్తోంది.

కుమురంభీం జిల్లాలోనూ అంతే. పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఆత్రం సుగుణ వచ్చే ఎన్నికల్లో ఆసిఫాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలనే వ్యూహంతో ముందుకెళ్తుంటే మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు వర్గం వ్యతిరేకిస్తోంది. సుగుణ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఎమ్మెల్సీ దండె విఠల్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యామ్‌నాయక్, జిల్లా మాజీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ల గ్రూపులు ఏకతాటిపైకి వచ్చాయి. కుమురంభీం జిల్లా కాంగ్రెస్ రాజకీయమంతా కలహాల కుంపటిగా మారింది.

వచ్చే ఎన్నికల్లో నిర్మల్ నుంచి తను లేదా తన కుటుంబ సభ్యుల నుంచి ఒకరిని బరిలో దించాలనే వ్యూహంతో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పావులు కదుపుతుండటాన్ని శ్రీహరిరావు వర్గం బహిరంగంగానే వ్యతిరేకిస్తోంది. రెండు వర్గాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సంతృప్తిపర్చటం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు పరీక్షగా మారింది. ఖానాపూర్‌లో తన స్థానానికి ఢోకా లేకుండా చూసుకోవటం కూడా బొజ్జుకు కత్తిమీద సాములా తయారైంది.

రాష్ట్ర మంత్రిగా ఉన్న వివేక్ సహా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మంచిర్యాల జిల్లాకే పరిమితం కావటంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌ను ఏకతాటిపై నడిపించే నాయకత్వం కొరవడింది. ఎవరిష్టం వచ్చినట్లు వారు నడుచుకోవటం, చీటికి, మాటికి పీసీసీకి ఫిర్యాదులు చేసుకోవటం పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తోంది. ప్రస్తుతానికైతే కాంగ్రెస్ రాజకీయమంతా గందరగోళంగా సాగుతోంది

(c) eenadu

సేవల్లో మేటి.. స్వర్ణోత్సవ ఖ్యాతి

● శ్రీరాంపూర్ దశ, దిశను మార్చిన ఎస్సార్పీ-1 గని ● 50 ఏళ్ల వేడుకలకు ముస్తాబు

న్యూస్‌టుడే, శ్రీరాంపూర్ : ఒకప్పుడు రైతు కూలీలుగా తిండి గింజల కోసం అల్లాడేవారికి బొగ్గు గనులు ఒక వరంగా మారాయి. నాడు సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికులుగా చేరిన వారి జీవితాల్లో వెలుగులు నింపాయి. శ్రీరాంపూర్ గ్రామాన్ని ఆనుకుని 1976లో తవ్విన ఎస్సార్పీ-1 గని సెప్టెంబరు 2 నాటికి 50 ఏళ్లు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాలకు సిద్ధం అవుతోంది.



అప్పటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన శిలాఫలకం

ఎస్సార్పీ-1 గనితో కుగ్రామంగా ఉన్న శ్రీరాంపూర్ ఒక్కసారిగా పారిశ్రామిక ప్రాంతంగా ఎదగడం మొదలైంది. స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించింది. కార్మికుల సంఖ్య పెరగడంతో జనాభా క్రమంగా పెరుగుతూ గ్రామం నుంచి పట్టణ స్థాయికి ఎదిగింది. 1995 నాటికి శ్రీరాంపూర్ గ్రామం విస్తరించి తాళ్ల పల్లి, నస్పూర్ మేజర్ గ్రామ పంచాయతీలను నాలుగు జీపీలుగా విభజించారు. 2018 నాటికి ఇవన్నీ విలీనమై నస్పూర్ పురపాలికగా అవతరించింది. నస్పూర్ ప్రత్యేక మండలంగా ఆవిర్భవించింది. తర్వాత మంచిర్యాల, నస్పూర్ పురపాలికలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వేలాది కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగాయి. ఇదంతా సింగరేణి బొగ్గు గనుల చలవే. సింగరేణిపై ఆధారపడి అనేక వ్యాపారాలు, విద్యా సంస్థలు, వృత్తివిద్యా కోర్సులు, కళాశాలలు ఆవిర్భవించాయి.

[illegible] జీఎం శ్రీనివాస్‌తో ఉద్యోగులు

కుగ్రామం నుంచి కార్పొరేషన్ స్థాయికి..

శ్రీరాంపూర్ గ్రామ పక్కనే ఉండటంతో ఆ ఊరి పేరిట సింగరేణి యాజమాన్యం ఎస్సార్పీ-1 అని గనికి నామకరణం చేసి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించింది. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో ఆర్కే-5, 6, 7, 8 లాంటి గనులు అంతకుముందే ఏర్పడినా అవన్నీ రవీంద్రఖని పేరుతోనే ఉన్నాయి.

కష్టాలను అధిగమించి..

శ్రీరాంపూర్ ఏరియాలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఎక్కడలేని విధంగా ఎస్సార్పీ-1 గని అత్యంత గ్రేడియంట్ ఉన్న కష్టతరమైన గని. 1 ఇన్ 2.5 గ్రేడియంట్ అంటే ఒక అడుగు లోతు 2.5 అడుగుల ఏటవాలు అన్నమాట. ఇతర గనులు కేవలం 3 నుంచి ఆరు అడుగుల గ్రేడియంట్ ఉంటాయి. ఇక్కడ పనిచేయడమే కత్తిమీద సాము లాంటిది. అలాంటి గనిలో యాజమాన్యం మ్యాన్‌రైడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడంతోపాటు, ఏమాత్రం సాధ్యం కాదనుకున్న యాంత్రీకరణను సుసాధ్యం చేసిన ఘనత అధికారులది. ఎస్డీఎల్ యంత్రాలను ఈ గనిలో ప్రవేశపెట్టారు. ఇక్కడ పనిచేసిన అధికారులు, కార్మికులు అనేక మంది ఉన్నతస్థానాలకు చేరుకున్నారు. భద్రత పరంగా ఈ గని 5 స్టార్ రేటింగ్ సాధించడం ఇక్కడి ఉద్యోగుల ప్రతిభకు నిదర్శనంగా చెప్పవచ్చు.

ఎంతో మంది జీవితాలను మార్చింది

- ఎం.రామన్న, విశ్రాంత మైనింగ్ సర్దార్

మందమర్రి కేకే-1 గనిలో పనిచేస్తుండగా 1986లో ఎస్సార్పీ-1 గనికి బదిలీపై పంపించారు. అప్పటికి నేను బదిలీ వర్కర్‌గా ఉంటూ, షాట్‌ఫైరర్, మైనింగ్ సర్దార్ పదోన్నతుల కోసం శిక్షణ పొందాను. ఇక్కడికి వచ్చి 1990లో షాట్‌ఫైరర్‌గా పదోన్నతి పొంది, ఆ తర్వాత మైనింగ్ సర్దార్‌గా మరోసారి ఉద్యోగోన్నతి పొందాను. అప్పట్లో పదో తరగతికిపైగా చదివి ఉన్నవారు పదోన్నతుల కోసం కష్టపడి పరీక్షలు రాసినవారు ఎంతో మంది కార్మికుల నుంచి అధికారులుగా, జీఎంలుగా ఎదిగినవారు ఉన్నారు. అధికారులుగా చేరినవారు జీఎంలుగా, డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. 2021 ఆగస్టు 31న 60 ఏళ్లు నిండి ఉద్యోగ విరమణ పొందినా, ఎస్సార్పీ-1 గని అంటే కన్నతల్లిలాగే అనిపిస్తుంది.

'ఈ శ్రావణ మాసంలో మీ ఈనాడు పెళ్లిపందిరితో... సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం!'

నేడు అన్ని కులాల ప్రభుత్వ ఉద్యోగుల అవివాహితులకు ఈనాడు పెళ్లిపందిరి.నెట్ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

కరీంనగర్, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లిపందిరి.నెట్ నేడు అన్ని కులాల ప్రభుత్వ ఉద్యోగుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు ఆగస్టు ఆదివారం (30 ఆగస్టు 2026) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరులు బయోడేటా, ఫొటోలు దిగువన పేర్కొన్న వాట్సప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు. మరిన్ని వివరాలకు 83744 45190, 91543 40820 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

నోట్: ఈ శ్రావణంలో ప్రతి ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నమోదుతో

☛ ఒక నెల ప్రొఫైల్ హైలైటర్(మీ ప్రొఫైల్‌ను ఎక్కువ మంది చూసుకునే అవకాశం)

☛ అపరిమిత ఎక్స్‌ప్రెస్ ఇంట్రెస్టులు (మీకు నచ్చిన సంబంధాలకు ఆసక్తి తెలియజేసే అవకాశం)

రాష్ట్రపతితో రక్షాబంధన్ వేడుకల్లో ఏకలవ్య విద్యార్థి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని సిర్పూర్(టి) ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) 8వ తరగతి విద్యార్థి హనుమంతు.. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముతో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. తాను రూపొందించిన చిత్రాలను రాష్ట్రపతికి అందజేశారు. రాష్ట్రంలోని 23 ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. పీజీటీ ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు దర్శిక ఉన్నారు. వేడుకలకు ఎంపికవడంపై ప్రిన్సిపల్ రమేష్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రపతితో ఈఎంఆర్ఎస్ విద్యార్థులు

క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : క్రీడాకారులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకెళ్లాలని ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య రాష్ట్ర స్థాయి జూనియర్స్ విభాగం బాలబాలికల పోటీలు ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని 18 జిల్లాలకు చెందిన జట్ల క్రీడాకారులు హాజరయ్యారు. డాక్టర్ మనోజ్‌కుమార్, ప్రిన్సిపల్ మురాద్‌అలీ, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్, శిక్షకుడు సాయిరాజ్, సంఘ బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మురళీధర్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు

● ఎంపీ గోడం నగేశ్

తాంసి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని, సమస్యలు వివరిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. తాంసిలో రూ. 30 లక్షల నిధుల గోదాం నిర్మాణానికి భూమి పూజతో పాటు రూ. 34 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, కల్వర్టులను శనివారం ఆయన ప్రారంభించారు. తాంసిలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి ఆలయంలో పూజలు చేశారు. స్థానిక వాగు ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. తాంసి-గిరిగామ్ రోడ్డు అధ్వానంగా తయారైందని, మరమ్మతులకు నిధులు కేటాయించాలని అంబుగామ్, వామనగర్ గ్రామాల ప్రజలు ఎంపీకి సమస్యను వివరించారు. తాంసి స్త్రీశక్తి భవనం మరమ్మతులు, తాగునీరు ఇతర వసతులు కల్పించాలని మండల సమైక్య సభ్యులు, ఐకేపీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ మార్కెట్ ఛైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దారు గణేష్ రాథోడ్, ఏపీఎం భగవాండ్లు, ఎంపీవో అవినాష్, సర్పంచి సంతోష్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజు, భాజపా మండల అధ్యక్షుడు చంద్రకిరణ్, నాయకులు తదితరులున్నారు.

తాంసిలో గోదాం నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేశ్

విద్యా ప్రమాణాలను మెరుగుపర్చండి

ఉట్నూరు, న్యూస్‌టుడే : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఐటీడీఏ పీవో మంద మకరందు ఆదేశించారు. ఉట్నూరు పీఎమ్మార్సీలో ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఏటీ ఈవోలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తయ్యేలా చూడాలని, ఆహార పట్టిక ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని, బాలికల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీడీ ప్రేమకళ, డీటీడీవో అంబాజీ జాదవ్, ఏపీవో జనరల్ వసంత్‌రావు, ఉపవిద్యాధికారి గోడం చందన్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏసీఎంవో జగన్, జీసీడీవో ఛాయ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో మంద మకరందు చిత్రంలో అధికారులు

ఆకృతి ఆకట్టుకునేలా.. ప్రదర్శన మెచ్చేలా..

ఇచ్చోడ, న్యూస్‌టుడే: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మైదానంలో 'స్పోర్ట్స్ డే' ఆకృతిలో కూర్చొని ఆకట్టుకునేలా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ కిషన్ చౌహన్ మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ ప్రతిభ కనబరచాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని తెలిపారు.

ఇచ్చోడ గిరిజన గురుకుల విద్యార్థుల స్పోర్ట్స్ డే ప్రదర్శన

అటు రక్షణ విధులు.. ఇటు శిక్షణ తరగతులు

● అభినందనీయం కానిస్టేబుల్ కృష్ణ ప్రయత్నం

న్యూస్‌టుడే, మామడ, దస్తురాబాద్ :

పేదరికం కొందరికి అనేక జీవిత పాఠాలను నేర్పుతుంది. పట్టుదలతో ఉన్నత స్థితికి ఎలా వెళ్లాలో ఓ దారిని చూపిస్తుంది. లక్ష్యం చేరుకున్నాక హమ్మయ్య గట్టెక్కాంలే అని ఊరికే కూర్చోనివ్వదు. మరింత మంది జీవితాలను వెలుగు వైపు తీసుకెళ్లేలా ఉత్తేజ పరుస్తుంది. ఇలానే ఇతరుల విజయం కోసం ప్రయత్నిస్తున్న పోలీసు చౌహాన్ కృష్ణ ప్రస్థానం స్ఫూర్తిదాయకం..

మైదానంలో యువతకు శిక్షణనిస్తున్న కృష్ణ

కష్టాలను అధిగమించి

ఆదిలాబాద్ జిల్లా నార్నూరు మండలం మహాగామ్‌కు చెందిన కృష్ణది వ్యవసాయ కుటుంబం. చదువుకు ఆర్థిక పరిస్థితులు ఇబ్బంది పెట్టాయి. పేదరికాన్ని జయించాలంటే ప్రభుత్వ కొలువు సాధించాలన్న పట్టుదల ఉండేది. గురుకుల, ఆశ్రమ విద్యాలయాల్లో చేరి ఉన్నత విద్యను అందుకున్నారు. ఓయూలో ఎంఏ హిందీ పూర్తి చేశారు. సీఐఎస్ఎఫ్, సివిల్ కానిస్టేబుల్ కొలువులకు ఎంపికయ్యారు. ఆ ప్రయత్నంలో ఎన్నో అనుభవాలు వచ్చాయి. వాటిని ఇతరులకూ వివరిస్తూ ప్రయోజనం చేకూర్చాలంటే రాష్ట్ర పోలీసు శాఖలో చేరితే వీలవుతుందని 2018 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. యువతలో చైతన్యం తీసుకురావాలంటే హోదా పెద్దదే కానక్కర్లేదని నిరూపిస్తున్నాడు కృష్ణ.

యువత విజేతలవ్వాలని..

దస్తురాబాద్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కృష్ణ అందరిలా డ్యూటీ మాత్రమే చేస్తే ఇంతగా చెప్పనవసరం లేదు. కొలువు చేస్తూనే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పాఠాలు చెబుతారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమైన పుస్తకాలను సమకూరుస్తారు. మైదానంలో గంటల తరబడి పోలీసు ఉద్యోగాలకు సిద్ధమయ్యే వారికి శిక్షణనిస్తారు. గతంలో నిర్మల్, నర్సాపూర్(జి)లోనూ ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయన సూచనలు పాటిస్తూ ఎంతో మంది విజయం సాధించారు. ✦ సోల్జర్స్ అనే వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి వేలాది మందికి విద్యా ఉద్యోగ సమాచారం అందిస్తారు. వారితో జూమ్ మీటింగ్ ఏర్పాటు చేసి సూచనలు చేస్తారు.

✦ 2024లో నర్సాపూర్(జి)లో పనిచేస్తున్నపుడు ఆ బడిలో విద్యార్థులకు గురువులా పాఠాలు చెప్పి ఆదర్శంగా నిలిచారు.

✦ వందకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలకు ముందు విద్యార్థుల్లో ధైర్యం నింపేందుకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు.

✦ పోలీసు శాఖలో ఉత్తమ సేవ పురస్కారంతో పాటు అనేక రివార్డులు అందుకున్నారు కృష్ణ. ✦ 'మీ విజయం నా సంతోషం' అని యువతను ప్రోత్సహిస్తూ పేదరికాన్ని జయించేందుకు ఆయన చెప్పే సూచనలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటాయి.

నోట్స్ చాలా ఉపయోగపడ్డాయి

కృష్ణ నిర్వహించే సోల్జర్ వాట్సాప్ గ్రూప్‌లో నేను సభ్యురాలిని. ఐటీబీపీలో ఉద్యోగ ప్రకటన వెలువడిన తర్వాత పరీక్షకు సంబంధించిన చాలా నోట్స్ అందులో పెట్టేవారు. పూర్వ పరీక్ష పేపర్లు సైతం ఎప్పటికప్పుడు పోస్టు చేసేది. అవి నాకు ఎంతో ఉపయోగపడ్డాయి. మోటివేషన్ కోసం మాతో ఎప్పుడూ మాట్లాడటంతో ఆందోళన దూరమయ్యేది. **- శిరీష, ఐటీబీపీ కానిస్టేబుల్(ఉత్తరాఖండ్)బైంసా**

బాసర ఆలయానికి ఎస్బీఐ సహకారం

● ఉచిత ప్రయాణానికి బస్సు ఏర్పాటు

బాసర(ముథోల్), న్యూస్‌టుడే : బాసర అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎస్బీఐ సీఎస్సార్ కింద బస్సు ఏర్పాటు చేసింది. శనివారం హైదరాబాదులోని ఎస్బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చేతుల మీదుగా ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ అంజనీదేవికి తాళాలు అందజేశారు. అనంతరం వేదపండితులు బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ బస్సు రావడంతో రైల్వే స్టేషన్ నుంచి ఆలయానికి, ఆలయం నుంచి గోదావరి, ప్రయాణ ప్రాంగణానికి ఉచితంగా భక్తులను తీసుకెళ్లనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రవీణ్‌పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు తాళాన్ని ఆలయ అధికారులకు అందజేస్తున్న ఎస్బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్, కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు టీజీపీఎస్సీ గ్రూపు-1, 2, 3, 4 పోటీ పరీక్షలకు ఉచిత ప్రాథమిక జనరల్ స్టడీస్ కోచింగ్ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్ప సంఖ్యాకుల సంక్షేమ అధికారి దయానంద్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, వంద మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉందని చెప్పారు. సెప్టెంబరు 1 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రాంగణం, ఎంఏఎం క్యాంపస్ తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040-23236112, 90590 50062 నంబరులో సంప్రదించాలని కోరారు.

జపాన్ పర్యటనకు రంగయ్య మాస్టారు

కెరమెరి, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్ర పాఠశాల టీచర్స్ ఎక్స్‌పోజర్ విజిట్, ఎడ్యుకేషన్ ఎక్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని సావర్‌ఖేడ ప్రధానోపాధ్యాయుడు కేడర్ల రంగయ్య జపాన్ పర్యటనకు ఎంపికయ్యారు. మొదటగా రాష్ట్రంలో 29 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేయగా.. శనివారం ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 5-12 వరకు జపాన్‌లో పర్యటన చేయనున్నారు. ఎంపికపై మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ అభినందించారు.

కేడర్ల రంగయ్య

డీసీసీ అధ్యక్షుడిపై ఫిర్యాదు

నేరడిగొండ, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేశ్ జాదవ్ వ్యవహారశైలిని నిరసిస్తూ బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆడే గజేందర్ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు శనివారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో ఆడే గజేందర్‌తో కలిసి హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. జిల్లాలో నరేశ్ జాదవ్ పార్టీలో అనుసరిస్తున్న ఏకపక్ష ధోరణి గురించి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు వివరించినట్లు ఆడే గజేందర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకుని బతుకుతున్న వారి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు.

డీసీసీ అధ్యక్షుడు నరేశ్‌జాదవ్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు వివరిస్తున్న ఆడే గజేందర్

పాము కాటుతో రైతు మృతి

తానూరు(భైంసా), న్యూస్‌టుడే : పొలంలో పంటను కాపాడుకునేందుకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతును పాము కాటు రూపంలో మృత్యువు కబళించింది. కుటుంబీకులు, ఎస్సై షేక్ జుబేర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తొండాల గ్రామానికి చెందిన సాయిబు(45) గురువారం తన పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తున్నాడు. ఈ క్రమంలో పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో నిజామాబాద్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. భార్య పీరన్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాయిబు

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ఫ్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs. 300/- Only
Colour Rs. 350/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Adilabad:
80087 09949
90005 66042

REAL ESTATE

బ్యాంక్ సీజ్ చేసిన ఓపెన్ ప్లాట్స్ మరియు ఇండివిడ్యువల్ హౌసెస్ అమ్మకానికి కలవు. ఆసక్తి కలవారు సంప్ర॥ 88860 68456 (శ్యామ్).

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

MANGO FARM for sale
12.5 Acres,
RTC Bus Route Road,
Near SIDDIPET- MUSTABAD
"T" JUNCTION,
WITH 3 BORE WELLS.
TOTAL FENCING
PH:9391515600

PLOT FOR SALE

ప్లాట్ అమ్మబడును. శ్రీశ్రీనగర్, మంచిర్యాల 200 చ.గజాలు (30X60) తూర్పు ఫేసింగ్ 30 ఫీట్ల రోడ్. సెల్: 79890 33921.

JOBS

Staff Required for CCTV Cameras Installation & Servicing in Mancherial. Lorven I Zone CCTV Cameras. Cell: 94404 84878.

మంచిర్యాలలో త్వరలో ప్రారంభం కాబోతున్న షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు సేల్స్ బాయ్స్, సేల్స్ గర్ల్స్, సిస్టం ఆపరేటర్స్ కావలెను. సెల్: 83090 34069.

హైదరాబాద్ సిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంట చేయడానికి బ్రాహ్మణ స్త్రీలు కావలెను. జీ॥ 25K-30K, భోజనము + వసతి కల్పించబడును. వెంటనే ✆ 9866252220

ఆర్వీ డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసినవారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

Exp. ఆయాలు / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/-నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

WANTED
వందేభారత్ DEVELOPER'S
5-Crores Club లో జాయిన్ అవ్వడానికి హైదరాబాద్‌లో ఉన్న రియల్ ఎస్టేట్ సంస్థ మార్కెటింగ్ సిబ్బందిని ఆహ్వానిస్తుంది
Fortuner Car, Villa, 1 Kg Gold
2 year's Time
✆ 77991 60000

WANTED
హైదరాబాద్ లోని ఇబ్రహీంపట్నం దగ్గరలో ఉన్న మా ఫామ్ ల్యాండ్ లో రెండు కుటుంబాలు ఉన్నాయి. వారు వివిధ రకాల పనులు చేస్తుంటారు.
ఆ కుటుంబాలు చేసే పనులు సూపర్‌వైజు చేయడానికి ఒక ఇంచార్జ్ కావాలి.
నెలకు జీతము 30,000.
వయస్సు 25 నుండి 40 సం॥ లు,
అర్హత - ఇంటర్మీడియట్.
ఏదైనా రంగంలో ఇంచార్జ్ కానీ సూపర్వైజర్ గా కానీ పనిచేసిన అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీలు 31-08-26, 01-09-26 & 02-09-26, టైమింగ్స్ : ఉ. 10 నుండి 6 సా.
ఇంటర్వ్యూ కొరకు ఫోటోలు తీసుకొని రాగలరు.
సంప్రదించండి :
కామినేని హాస్పిటల్ దగ్గర, సూర్యోదయ కాలనీ, L.B.నగర్, హైదరాబాద్. Ph. 7842226933.
Mail : hradmin@sribalajiads.in

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80087 09949
90005 66042
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11479

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బాలుడిని చితకబాదిన ఘటనపై విచారణ

బోథ్, న్యూస్‌టుడే: బోథ్ మండలం కుచులాపూర్ శివారులోని వేదం పాఠశాలలో నర్సరీ చదువుతున్న బాలుడిని టీచర్ చితకబాదిన ఘటనపై శనివారం ఎంఈవో మహమ్మద్ హుస్సేన్ విచారణ జరిపారు. బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనపై ప్రిన్సిపల్ సంతోష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. షోకాజ్ నోటీసు జారీ చేశారు. సమగ్ర విచారణ నివేదికను డీఈవో అందజేస్తానని ఎంఈవో పేర్కొన్నారు.

1098కు సమాచారం అందించాలి

బోథ్ మండలంలోని వేదం పాఠశాలలో శనివారం బాలల సంరక్షణ కమిటీ సభ్యులు పర్యటించారు. విద్యార్థులు సమస్యలుంటే 1098కు సమాచారం అందించాలన్నారు. బాలుడిని టీచర్ చితకబాదిన ఘటనపై జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. జిల్లా కోఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.

బోథ్‌లోని వేదం పాఠశాలలో బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో మహమ్మద్ హుస్సేన్

మార్కుల కేటాయింపులో పారదర్శకత

● ప్రభుత్వ పాఠశాలల మూల్యాంకనంలో నూతన విధానం

న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం :

ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఏ- 1, 2 పరీక్షలకు సంబంధించిన సమాధానపత్రాలను ఇదివరకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే మూల్యాంకనం చేసి మార్కులు కేటాయించేవారు. ఇకపై ఆ పరిస్థితి ఉండదు. ఎక్స్‌టర్నల్ ఎవాల్యుయేషన్ సిస్టం పేరిట కొత్త విధానానికి రూపకల్పన చేశారు. తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుంది. మార్కుల కేటాయింపులో పారదర్శకత, మూల్యాంకనంలో జవాబుదారీతనం పెంపొందించేందుకు ఇది దోహదపడనుంది.

ఏం చేస్తారంటే

☛ పరీక్షలు ఎప్పటిలాగే ఆయా పాఠశాలల్లో జరుగుతాయి. పరీక్ష పూర్తవగానే సమాధాన పత్రాలను ప్రధానోపాధ్యాయుడు స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో మండల విద్యాధికారికి అప్పగిస్తారు.

☛ వీటిని అదే మండలానికి చెందిన ఇతర ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా మండలానికి ఒక మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేస్తారు. సొంత పాఠశాలకు చెందిన జవాబు పత్రాలను దిద్దడానికి, మార్కులు వేయడానికి ఆస్కారముండదు.

☛ 3-5 రోజుల్లో మూల్యాంకనం పూర్తిచేయాలి. మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

☛ ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో ఒక్కో సమాధానపత్రానికి రూ. 2, ఉన్నత తరగతులకు రూ. 3 చొప్పున పారితోషికంగా చెల్లిస్తారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులు, వారు రాసే పరీక్షలు చొప్పన మూల్యాంకనానికి కేటాయించిన నిధుల వివరాలు..

జిల్లా	మండలాలు	మొత్తం పాఠశాలలు	విద్యార్థులు	కేటాయించిన నిధులు (రూ.లలో)
ఆదిలాబాద్	21	693	49,389	16,82,906
కుమురం భీం	15	704	34,648	11,52,028
మంచిర్యాల	18	709	35,441	13,01,784
నిర్మల్	19	713	40,696	14,60,366

బాధ్యతలు ఇలా..

✦ పరీక్షలు నిర్వహించడం, జవాబుపత్రాలు సేకరించడం, హాజరుతో వాటిని సరిపోల్చడం, తరగతి, సబ్జెక్టు వారీగా సమాధానపత్రాలు ఏర్పాటు చేయడం, వాటిని జాగ్రత్తగా సీల్‌చేసి, గుర్తింపు వివరాలను కవర్‌పై నమోదుచేయడం, ఎమ్మార్సీలో అప్పగించడం ప్రధానోపాధ్యాయుడి విధి.

✦ పాఠశాలల నుంచి వచ్చే సీల్డ్ కవర్లను స్వీకరించడం, వాటిని సరిచూసుకోవడం, రసీదు ఇవ్వడం, రిసిప్ట్ రిజిస్టర్ నిర్వహించడం, సమాధానపత్రాలు జాగ్రత్తగా భద్రపర్చడం, సీల్ జాగ్రత్తగా ఉందో లేదో చూడటం, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత తరగతుల వారీగా మూల్యాంకన బాధ్యులను నియమించడం, ఆన్‌లైన్ నమోదు సకాలంలో జరిగేలా చూడటం మండల విద్యాధికారి బాధ్యత.

✦ జిల్లా విద్యాధికారి ప్రగతిని పర్యవేక్షించి మండలాల వారీగా సమీక్షించాలి.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..

మంచిర్యాల : 98663 07290
చెన్నూరు : 80085 73627
బెల్లంపల్లి : 99496 20369
కాసిపేట : 91001 77174
(10 AM TO 1 PM)

? బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ చెరువు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. సమస్యను పరిష్కరించాలి. **- శ్రీనివాసరాజు, పాత జీఎం కార్యాలయం కాలనీ.** బెల్లంపల్లి, న్యూస్‌టుడే

✔ రోడ్డు మరమ్మతుల కోసం చర్యలు చేపడుతున్నాం. రోడ్డుపై ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చివేస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- నిఖిల్, మున్సిపల్ ఏఈ**

? క్యాతనపల్లి పురపరిధిలోని రామాలయం చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే రహదారిపై వేగ నియంత్రికలు లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. **- రవి.** రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే:

✔ వేగ నియంత్రికల ఏర్పాటుకు చర్యలు చేపడతాం. **- శ్రీధర్, ఎస్సై, ఆర్కేపీ.**

? క్యాతనపల్లి పురపరిధిలోని 15వ వార్డు మల్లికార్జున నగర్‌లో రోడ్డు పక్కనున్న గణేశ్ ఆలయం వద్ద చెత్త వేస్తున్నారు. - కిశోర్

✔ చెత్త వేయకుండా అవగాహన కల్పిస్తాం.- **సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే

స్పందించి.. తీగలను తొలగించి

ఈనాడు స్పందనకు వందనం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : బెల్లంపల్లి పట్టణంలోని షంషీర్‌నగర్‌లో విద్యుత్తు స్తంభాలను తీగలు కమ్మేశాయి. సమస్యపై 'ఈనాడు'లో 'అల్లుకున్న తీగలతో ముప్పు' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. బెల్లంపల్లి ఏఈ స్పందించారు. సిబ్బందితో స్తంభాలకు ఉన్న తీగలను తొలగించారు.

గోదావరి తీరంలో చెత్త శుభ్రం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే : ముల్కల్ల గోదావరి పుష్కర ఘాట్ల వద్ద పేరుకుపోయిన చెత్తను శనివారం మంచిర్యాల నగరపాలక కార్మికులు శుభ్రం చేశారు. ఈ నెల 29న 'ఈనాడు'లో 'గోదావరి తీరం.. చెత్తమయం' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. నగరపాలక కమిషనర్ అన్వేష్ స్పందించారు. వెంటనే ముల్కల్ల గోదావరి నది ఆవరణలో కార్మికులతో చెత్తను శుభ్రం చేయించారు.

రామగుండం పోలీసు కమిషనరేట్‌కు ప్రశంస

గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రైమ్ పారామీటర్ల అమలులో రామగుండం పోలీసు కమిషనరేట్ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన యూనిట్లలో క్లస్టర్-2లో రామగుండం మొదటి స్థానంలో నిలిచింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రామగుండం పోలీసు కమిషనరేట్‌కు డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసా పత్రం అందజేశారు. ఈ మేరకు రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్ డీజీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.

డీజీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హిందూ తల్లికి.. ముస్లిం పెంపుడు కొడుకు అంత్యక్రియలు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే : వృద్ధాప్యంలో చేరిన తల్లిదండ్రుల బాగోగులు చూసుకోలేని కొడుకులున్న ఈ రోజుల్లో ఓ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన మహిళకు, ముస్లిం సామాజిక వర్గానికి చెందిన పెంచుకున్న కొడుకు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి మతాలకు అతీతంగా మానవత్వం చాటి ఆదర్శంగా నిలిచాడు.

మంచిర్యాలలోని ఇస్లాంపురలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన కొప్పర్తి అచ్యుత లక్ష్మి(87)కి పెంచుకున్న ముస్లిం కుమారుడు ముజామ్మిల్ ఇఫ్తికార్ హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. రాజమండ్రికి చెందిన అచ్యుత లక్ష్మి 50 ఏళ్ల కిందట మంచిర్యాలకు వచ్చి ఇక్కడ మైత్రి ఎయిర్ కండిషన్ సేల్స్ అండ్ సర్వీస్ వ్యాపారం ప్రారంభించారు. ఆమె భర్త 35 ఏళ్ల కిందట మృతి చెందాడు. వీరికి సంతానం లేకపోవడంతో అప్పుడు ఇక్కడి యువకుడు మహ్మద్ ముజామ్మిల్ ఇఫ్తికార్‌ను సొంత బిడ్డలా ఆప్యాయంగా చూసుకున్నారు. అతడి కుటుంబంలో ఆమె సభ్యురాలిగా కలిసిపోయింది. ఆమె పాడెను హిందువులు, ముస్లింలు కలిసి మోశారు. స్థానిక వైకుంఠధామంలో ఆమెకు ఇఫ్తికార్ అంతిమ సంస్కారాలు చేశారు. కార్పొరేటర్లు ముకేష్‌గౌడ్, అబ్దుల్ సత్తారు, ముస్లిం సోదరులు షాయాక్ అలీ, ముజాహిద్, మొహమ్మద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుత లక్ష్మి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ముజామ్మిల్ ఇఫ్తికార్ (అంతరంలో అచ్యుత లక్ష్మి)

రేషన్ బియ్యం పట్టివేత

జైపూర్, న్యూస్‌టుడే : మంచిర్యాల నుంచి చెన్నూరుకు ఓ వ్యానులో అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం ఉదయం జైపూర్‌లో పట్టుకున్నామని ఎస్సై భూమేష్ తెలిపారు. చెన్నూరుకు చెందిన కోడూరి శ్రీనివాస్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఆక్రమణకు గురైన అటవీ భూముల స్వాధీనం

జన్నారం, న్యూస్‌టుడే : కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని జన్నారం రేంజి పరిధి కంపార్ట్‌మెంట్ నం.308 గడ్డంగూడ శివారులోని 25 ఎకరాల అటవీ భూమిని ఆక్రమణదారుల నుంచి తిరిగి అటవీశాఖ స్వాధీనం చేసుకొని అందులో మొక్కలు నాటినట్లు జన్నారం అటవీ డివిజనల్ అధికారి ఎం.రామ్‌మోహన్ తెలిపారు. మండల కేంద్రంలోని అటవీ డివిజనల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మీపూర్ తండాకు చెందిన కొందరు వ్యక్తులు 2011 నుంచి ఆ ప్రాంతంలో అక్రమంగా పాకలు నిర్మించడం, సాగు చేయడం వంటి పనులకు పాల్పడ్డారు. జన్నారం పోలీస్ ఠాణాలో కేసులు నమోదు చేసి లక్షెట్టిపేట కోర్టులో హాజరుపరచగా.. వారు 47 రోజులు జైలుకు వెళ్లి వచ్చినట్లు చెప్పారు. అటవీ భూములను ఆక్రమించినా.. అక్రమంగా అటవీ సంపదను కొల్లగొట్టినా.. అటవీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

చెన్నూరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని గాంధీచౌక్, రావిచెట్టు, తదితర ప్రాంతాల్లో ఉన్న దుకాణాలు, పాన్‌షాపుల్లో పోలీసులు నార్కోటిక్ డాగ్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాలను వినియోగించినా.. విక్రయించినా సమాచారం అందించాలని సీఐ బన్సీలాల్ కోరారు. అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు యువకులను పరీక్షల నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి పంపించారు. ఎస్సై శ్యాంపటేల్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో డిప్యూటీ కలెక్టర్ ఆకస్మిక...

హాజీపూర్, న్యూస్‌టుడే : మండలంలోని కర్ణమామిడి, టీకనపల్లి గ్రామాల్లో శనివారం జిల్లా శిక్షణ డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ విలాయత్ అలీ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆయా పంచాయతీల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. నెలలో ఒకరోజు ప్రజలంతా స్వచ్ఛందంగా శ్రమదానం చేసేలా అవగాహన కల్పించాలని కార్యదర్శులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి కిషన్, సర్పంచులు బొడ్డు భూమన్న, తిరుపతమ్మ, ఎంపీవో సుమన్, కార్యదర్శులు శ్వేత, హారిక, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సంఘం ప్రతినిధిగా జన్నారం ఎస్సై ఎన్నిక

జన్నారం, న్యూస్‌టుడే : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పోలీస్ సబ్ డివిజన్ పోలీస్ సంఘం ప్రతినిధిగా జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్, లక్షెట్టిపేట సర్కిల్ ప్రతినిధిగా హెడ్ కానిస్టేబుల్ లింగన్న ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను జన్నారం ఠాణాలో పోలీసులు సన్మానించారు. ఏఎస్సై ఉమేశ్, హెడ్ కానిస్టేబుళ్లు దేవన్న, గౌస్, తుకారాం, శ్రీనివాసరావు, దత్తు, కానిస్టేబుళ్లు వెంకటేశ్, చంద్రమౌళి, సంతోష్, శేఖర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దారులు అధ్వానం.. ప్రయాణం నరకం

పరిశీలన

జిల్లాలోని రహదారులు అధ్వానంగా మారాయి. పల్లె పట్టణం అనే తేడా లేకుండా ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. అడుగడుగునా గుంతలు తేలి చుక్కలు కనిపిస్తున్నాయి. మరోవైపు మట్టి రహదారులు వర్షానికి తడిసి బురదమయంగా మారుతున్నాయి. గుంతల నిండా నీళ్లు చేరి అసలు అక్కడ గుంత ఉందో లేదో తెలియక అదుపుతప్పి కింద పడుతున్నారు. ఏళ్లుగా మరమ్మతులు లేక ప్రజలు పాట్లు పడుతున్నారు.

మంచిర్యాలలోని శ్రీనివాస్ కాలనీ, రోడ్డు నెం.2లో రహదారి బురదగా మారి వాహనదారులు అదుపు తప్పి జారి పడుతున్నారు. అక్కడ చినుకు పడితే చాలు రహదారి చిత్తడిగా మారుతోంది. విద్యార్థులను వాహనాలపై పాఠశాలలకు తీసుకెళ్లినప్పుడు ఆ బురద రోడ్డుపై ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అక్కడ బీటీ లేదా సిమెంట్ రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం

భీమిని మండలం మారుమూల గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి.

పెద్దగుడిపేట వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ఇబ్బందులు పడుతున్నారు. చిన్నగుడిపేట నుంచి పెద్దగుడిపేటకు సుమారు 2 కి.మీ. మేర గుంతలతో బురదమయంగా మారి నరకం అనుభవిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి రాకపోకలు సాగించేందుకు ఇది ఒక మార్గమే ఉందన్నారు. **- న్యూస్‌టుడే, భీమిని**

కాసిపేట మండలం రేగులగూడెం మీదుగా, గుర్వాపూర్ చింతగూడెంకు వెళ్లేందుకు నూతన బీటీ రహదారి నిర్మించారు. మధ్యలో సీసీ రహదారి ఉన్నచోట వదిలేసి దారి నిర్మాణాన్ని చేపట్టారు. రేగులగూడెంలోని సీసీ రహదారి పగుళ్లు తేలి, అధ్వానంగా తయారైంది. ఏడు కిలో మీటర్ల దారిలో 200 మీటర్ల పొడవున ఉన్న సీసీ రహదారి గుంతలమయంగా మారి ప్రయాణం నరకంగా మారింది.
- న్యూస్‌టుడే, కాసిపేట

'సాంకేతిక మెలకువలతో నాణ్యమైన పట్టుగూళ్లు'

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టు పురుగుల పెంపకంలో రైతులు సాంకేతిక మెలకువలు పాటించడం ద్వారా నాణ్యమైన పట్టుగూళ్లను ఉత్పత్తి చేయవచ్చని చెన్నూరు కేంద్ర పట్టు మండలి(సీఎస్‌బీ) శాస్త్రవేత్త, జాయింట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. చెన్నూరు మండలం లంబడిపల్లిలో శనివారం పట్టుపురుగుల పెంపకంపై రైతులు నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. రీలింగ్‌లో రైతులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి ప్రభుత్వ సహకారంతో ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శాస్త్రవేత్త రమ్య, సర్పంచి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

చేయూతనందించి.. భరోసా కల్పించి

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : తల్లిదండ్రులను కోల్పోయిన ఓ బాలిక చదువుకు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు చేయూతనందించారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ ఏరియాకు చెందిన విజ్జిగిరి సతీష్-రజిత దంపతులు అనారోగ్యంతో మృతి చెందారు. వారికి 5వ తరగతి చదువుతున్న కూతురు అక్షిత ఉంది. ప్రస్తుతం తన తాత ఇంట్లో ఉంటున్న ఆ బాలిక పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతోంది. పాఠశాల ఫీజు చెల్లించడం కష్టంగా మారడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు అక్షిత చదువుకు సంబంధించి పదో తరగతి వరకు ఫీజు మొత్తాన్ని తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలకు వచ్చి యాజమాన్యంతో మాట్లాడి కొంత ఫీజు చెల్లించారు.

బాలికకు రసీదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు

వృత్తి విద్యా కోర్సుల శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మందమర్రి పట్టణం: మందమర్రిలో సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి విద్యా కోర్సుల శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ సీహెచ్ అశోక్ తెలిపారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ డీటీపీ కోర్సులను నేర్చుకునేందుకు సోమవారం వరకు జీఎం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కోనంపేట రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులు

నెన్నెల, న్యూస్‌టుడే : మన్నెగూడెం నుంచి కోనంపేట, కుశ్నపల్లి నుంచి వేమనపల్లి మండలం చామనపల్లి వరకు రోడ్డు నిర్మాణం కోసం అటవీ శాఖ అనుమతి వచ్చిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు హరీశ్‌గౌడ్, జిల్లా కార్యదర్శి సుంకరి శ్రీనివాస్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అటవీ శాఖ అనుమతులతో పాటు కోనంపేట రోడ్డుకు రూ.2.43 కోట్లు, చామనపల్లి రోడ్డుకు రూ.2.20 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఎమ్మెల్యే వినోద్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని చెప్పారు.

ప్రజల సౌకర్యార్థం అంబులెన్స్ సేవలు

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రతిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో అత్యవసర సేవల కోసం అందజేసిన వెంటిలేటర్‌తో కూడిన అంబులెన్స్‌ను ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శనివారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంబులెన్స్‌ను అందజేసిన ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంత అంజలి, వైస్ ఛైర్‌పర్సన్ మోత్కూరి రాజేశ్వరి, కమిషనర్ విజయ్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్, చల్ల నాగభూషణం, మహ్మద్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటలో అంబులెన్స్‌ను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

పెళ్లికి మీరే పెద్దలవ్వండి!

● పేదింటి బిడ్డకు పుట్టెడు కష్టాలు

న్యూస్‌టుడే, జన్నారం : తల్లి మానసిక వికలాంగురాలు, తండ్రి అనారోగ్యంతో ఏ పని చేయలేని పరిస్థితి. కూతురి పెళ్లి వచ్చే నెల 5న నిర్వహించేందుకు ముహూర్తం కుదుర్చుకున్నారు. చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో ఏమి చేయాలో తోచక దాతల సాయం కోరుతున్నారు. ఇద్దరు బాబాయిలు ఉన్నా.. వాళ్ల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. చెల్లితో కలిసి ప్రతి రోజు వస్త్ర దుకాణంలో పని చేస్తూ వచ్చే వేతనంతో తల్లిదండ్రులను పోషించుకుంటూ కుటుంబ భారాన్ని మోస్తున్న ఆ యువతి పెళ్లి జరగాలంటే దాతలే పెళ్లి పెద్దలు కావాలి.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడకు చెందిన బిస్కుల రాములు-సరోజ దంపతులకు మానస, మమత ఇద్దరు కూతుళ్లు. పదో తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆర్థిక స్తోమత బాగోలేకపోవడంతో మండల కేంద్రంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నారు. మానసకు దగ్గరి బంధువుతో వివాహం కుదిరింది. వచ్చే నెల 5న పెళ్లి చేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. కనీసం లగ్న పత్రికలు ముద్రించేందుకు కూడా చేతిలో డబ్బులు లేకపోవడంతో మానవతామూర్తుల సాయం కోరుతున్నారు. ఇప్పటి వరకు పెళ్లి పనులు మొదలు కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా రాములు గతంలో గిరిజన సహకార సంస్థలో సేల్స్‌మెన్‌గా ఉద్యోగం చేసేవారు. భార్యా పిల్లల పోషణ కోసం కూలీగా మారాడు. నాలుగేళ్ల కిందట అనారోగ్యం బారినపడ్డాడు. భార్య సరోజ మానసిక వికలాంగురాలు. కొంతకాలం పాటు ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. నన్ను మీ కూతురిగా భావించి మనసున్న ప్రతి ఒక్కరూ సహకరించాలని మానస వేడుకుంటున్నారు.

తల్లిదండ్రులతో మానస

'సర్' నోటీసులు అందిస్తున్నాం

ఏసీసీ, న్యూస్‌టుడే : ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణలో భాగంగా గుర్తించిన ఓటర్లకు నోటీసులు జారీచేస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి శనివారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని ఇప్పటి వరకు 32,183 మందికి నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

సిక్కులకు తగిన ప్రాధాన్యం కల్పించాలి

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీలో సిక్కులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేసినట్లు సిక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్ద రంజిత్‌సింగ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితుడు గురుదీప్ సింగ్ సప్పల్‌తో కలిసి ఆయనను కలిసినట్లు వెల్లడించారు.

ఉచిత బియ్యం పంపిణీ గడువు పెంచాలి

చెన్నూరు పట్టణం, న్యూస్‌టుడే : చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు అందించే మూడు నెలల ఉచిత బియ్యం పంపిణీ గడువును మరో వారంరోజుల పాటు పెంచాలని భాజపా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ శనివారం కోరారు. దుకాణాల్లో బియ్యం నిల్వలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో చాలామంది లబ్ధిదారులు పొందలేదని, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పంపిణీ గడువును పెంచాలన్నారు.

డిమాండ్లను పరిష్కరించాలి

కాసిపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వం డీఏ బకాయిలు, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కాసిపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని కోరారు.

తాండూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ మండల పరిషత్తు కార్యాలయ ఉద్యోగులు, కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

మంచిర్యాల పట్టణం: ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్రభుత్వ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా ఛైర్మన్ శ్రీహరి, తెలంగాణ అటవీ శాఖ సెంట్రల్ ఫోరం కార్యదర్శి పొన్న మల్లయ్య మాట్లాడారు.

ఊడ్చే యంత్రం.. మూలకు

బెల్లంపల్లి మున్సిపాల్టీలో రోడ్డుపై చెత్తాచెదారం తొలగించడం సిబ్బందికి కష్టతరంగా మారింది. ఇందుకోసం గతంలో ఊడ్చే యంత్రాన్ని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ఆరు నెలలకే ఆ యంత్రం మూలకు చేరింది. అప్పటి నుంచి ఇప్పటివరకు మరమ్మతులు చేయించలేదు. మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, బెల్లంపల్లి

పశువుల సంచారం.. ప్రమాదాలకు ఆస్కారం

కోటపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పశువుల సంచారం ప్రమాదాలకు తావిస్తోంది. చెన్నూరు, వేమనపల్లి మండలాలకు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. రోడ్లపై పశువులు తిరుగుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో అవి కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.
- న్యూస్‌టుడే, కోటపల్లి

విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్

సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూనే లక్ష్యాలను సాధించాలి

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థులు సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం గుడిపేటలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన విద్యార్థి మండలి ప్రమాణ స్వీకారం, జాతీయక్రీడా దినోత్సవంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థి మండలికి ఎన్నికైన వివిధ హౌస్‌ల కెప్టెన్లు, వైస్ కెప్టెన్‌లను వారు అభినందించారు. మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేటర్లు కమల, లగిశెట్టి రాజయ్య, చింతపండు శ్రీనివాస్, విద్యాలయం ప్రిన్సిపల్ లోకేష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 4 నుంచి ఏరియా వార్షిక క్రీడా పోటీలు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి వార్షిక క్రీడా పోటీలు సెప్టెంబరు 4 నుంచి నిర్వహిస్తున్నట్లు జీఎం ఎం.శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. 4న వాలీబాల్, 5న బాస్కెట్ బాల్, 6న షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, 7న బాల్ బ్యాడ్మింటన్, 8న ఫుట్‌బాల్, 9న హాకీ, 10న లాన్ టెన్నిస్, 11న కబడ్డీ, 12, 13 తేదీల్లో క్రికెట్, 15న అథ్లెటిక్స్, త్రోబాల్, స్విమ్మింగ్, 20న కల్చరల్, 27న పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయని వివరించారు.

డిజిటల్ విద్యతో మెరుగైన ఫలితాలు

బెల్లంపల్లి పట్టణం: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు డిజిటల్ విద్య ఎంతగానో దోహదపడుతుందని మైండ్‌స్పార్క్ ప్రతినిధులు పేర్కొన్నారు. బెల్లంపల్లి టీజీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ(సీఓఈ) బాలుర పాఠశాలలో ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లకు ఒకరోజు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. డీసీఓ రమా కల్యాణి, మైండ్ స్పార్క్ స్టేట్ అసోసియేషన్ మేనేజర్ శివప్రసాద్, ప్రాజెక్ట్ లీడ్ మల్లికార్జున, జోనల్ మేనేజర్లు ఎం.భీంరావు, రమేష్, రేవతి, సంజీవ్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

రామకృష్ణాపూర్, చెన్నూరు పట్టణం, మంచిర్యాల విద్యావిభాగం, తాండూరు, మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జాతీయ క్రీడా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల క్రీడా జ్యోతితో ర్యాలీ తీశారు. క్రీడాకారులను, శిక్షకులను సన్మానించారు. క్రీడా పోటీలను నిర్వహించారు.

చెన్నూరులో క్రీడా జ్యోతితో క్రీడాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు

ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు, క్రీడా సంఘాల సభ్యులు

మిమ్స్ డిగ్రీ కళాశాలలో..

ఆర్కేపీలో... క్రీడాకారులు

తాండూరులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గిడుగు రామ్మూర్తికి నివాళులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి ప్రిన్సిపల్ పి.సునీత, పలువురు ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ వహీదా, తెలుగు విభాగం అధ్యాపకులు రజిత, సరిత పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డికాలనీలో భూసమస్యను పరిష్కరించాలి

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే : మంచిర్యాలలోని రెడ్డికాలనీలో భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. కాలనీవాసి కృష్ణ మాట్లాడుతూ రెడ్డికాలనీలో సర్వే నం.195, 196, 197, 423, 426లోని దాదాపు 550 ఇంటి నంబర్లు నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఏసీసీ, న్యూస్‌టుడే : ఇతర బ్యాంకులతో పోటీపడుతూ తమ ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని యూనివర్సల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ వి.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం బ్యాంకులో నిర్వహించిన 50వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సహకార శాఖ సూపరింటెండెంట్ కె.రవిందర్‌రావు, బ్యాంకు సీఈవో కేవీఎస్ఎస్ మూర్తి, డైరెక్టర్లు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కృష్ణమూర్తి, ప్రసాద్‌రావు, శ్రీదేవి, రాజలింగు, భానుప్రకాష్, బక్కయ్య, సుశీల, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఛైర్మన్ వి.వినయ్‌కుమార్

కార్మికులకు మేలు జరిగేలా ఒప్పందాలు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : కార్మికులకు మేలు జరిగేలా ఒప్పందాలు చేసుకుంటున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శనివారం ఎస్సార్పీ-3, 3ఏ గని వద్ద సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన చర్చల్లో పలు కీలక అంశాలు అమలు చేసేందుకు యాజమాన్యం ముందుకొచ్చిందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్తు: ఎస్ఈ రాజన్న

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత వెలుగులు అందిస్తున్నామని విద్యుత్తు సంస్థ ఎస్ఈ బి.రాజన్న అన్నారు. చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 961 కేంద్రాలకు ఉచిత కనెక్షన్లు ఇచ్చినట్లు గుర్తుచేశారు.

నేత్రదానంపై అవగాహన

మంచిర్యాల వైద్యవిభాగం: నేత్రదానంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉపవైద్యాధికారి, పీఓ సుధాకర్‌నాయక్ అన్నారు. సాయికుంట ఆశ్రమ పాఠశాలలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓలు వెంకటేశ్వర్లు, నాందేవ్, పుట్ట సత్తయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీఓ సుధాకర్‌నాయక్

జ్వరాల బారిన పెద్ద ధర్మారం

కాసిపేట, న్యూస్‌టుడే : కాసిపేట మండలం చిన్న ధర్మారం పంచాయతీ పరిధిలోని పెద్ద ధర్మారంలో జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామస్థులు జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం వంటి లక్షణాలతో బాధపడుతున్నట్లు చెబుతున్నారు. ఓ బాలుడికి డెంగీ జ్వరం సోకినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబంలో అయిదుగురు జ్వరాలతో బాధపడుతున్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

జైపూర్: ఇందిరమ్మ ఇళ్లతోపాటు జలసిరి పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి చంద్రయ్య అన్నారు. కుందారంలో పర్యటించిన ఆయన పంట కుంటల పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఓటరు జాబితాపై సూచనలిస్తున్న పి.చంద్రయ్య

(c) eenadu